
క్లుప్తంగా

రేడియం హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



కైకలూరు:చీకటిలో రోడ్డు దాటుతున్న గేదెల వలన తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో కైకలూరుకు చెందిన గుర్రం సాగర్ అనే వ్యక్తి రూ.30,000 ఖర్చుతో 10 రేడియం హెచ్చరిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశాడు. లైటు పడగానే గేదె చిత్రంతో పాటు హెచ్చరిక మిరిమిట్లు గొలుపుతూ కనిపిస్తోంది. స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ తరఫున వీటిని అందిస్తున్నట్లు చెప్పాడు. కైకలూరు-ఏలూరు రహదారిలో కొవ్వాడలంక నుంచి పెద ఎడ్లగాడి వరకు రాత్రి వేళ వీధిలైట్లు ఉండవు. సమీప గ్రామాల్లో రైతులు గేదెలను కొల్లేరులో మేతకు వదులుతున్నారు. అవి చీకటి పడిన తర్వాత రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. సాగర్‌కు వచ్చిన ఆలోచనను అందరూ అభినందిస్తున్నారు.

అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు వచ్చే నెల 2వ తేదీ వరకు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు 4వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు అన్ని తరగతుల విద్యార్థులకు తెలుగు సబ్జెక్టులో పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నుంచి ఉపాధ్యాయులు తీసుకుని పరీక్షలు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పామర్రు(తోట్లవల్లూరు): మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని, అదే శ్రేయస్కరమని ఎస్ఐ ఎం.అర్జునరాజు పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరు పాలెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడు వ్యవసనాలతో జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. గంజాయి మత్తు పదార్థాలను తీసుకోవడం వలన భవిష్యత్ పాడైపోతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి పట్ల ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.పద్మావతి దంపతులను మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం సత్కరించారు. పద్మావతి మరికొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల్లో పద్మావతి దంపతులను ఉపాధ్యాయ సంఘాల నాయకులు బేతాల రాజేంద్రప్రసాద్, జి.రమేష్, రెడ్డి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, జయలక్ష్మీ, విజయకుమారి, శేఖర్, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఆంజనేయులు, విజయదుర్గ పాల్గొన్నారు.

నేడు తెలుగు పండితులకు సత్కారం

పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఘంటసాల ఎన్టీఆర్ కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి తెలిపారు. హైస్కూల్లోని తెలుగు ఉపాధ్యాయులు, పీడీలను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

తూడుపిచ్చికాడ నివారణ చర్యలు



నందివాడ: నందివాడ మండలం జొన్నపాడు సెక్షన్ అరిపిరాల పంట కాలువపై తూడు పిచ్చికాడను తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం తూడు పిచ్చికాడను నివారించేందుకు మందును పిచికారీ చేయించారు.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



కరోనా సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కోసం కుటుంబాలను సైతం వదిలి వైద్యులు సేవలందించారు. కోల్‌కతాలో విధి నిర్వహణలో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దారుణం. వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. కోల్‌కతాలో జరిగిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి.

– కాసాని వేద సుప్రజ, ఎంపీపీ, పమిడిముక్కల



జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణం

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటన దారుణం. ప్రస్తుతం జరుగుతున్న ఘటనలతో వైద్యుల మనోభావాలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. సమాజంలో మార్పు రావాలి. ఆస్పత్రుల్లో పోలీస్ భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– ఏనుగ వెంకటరమణకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు, పమిడిముక్కల



పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

విజృంభిస్తున్న దోమలు

కైకలూరు: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాలు ప్రారంభంలోనే చెత్తతో స్వాగతం పలుకుతున్నాయి. పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమల బెడద అధికమైంది. చెత్త పడేసేందుకు జాగా దొరకడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పంచాయతీలు పాడుపడ్డ కొంపల్లా ఉన్నాయని ఆరోపించిన నాయకులు అధికారంలోకి రాగానే వాటి ఊసే ఎత్తడం లేదు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి ముదినేపల్లి మండలాల్లో కలిపి 110 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కైకలూరు మండలంలో ఆటపాక, గోనెపాడు, రాచపట్నం, కైకలూరు, కలిదిండి మండలంలో మూలలంక, పెదలంక, భాస్కరరావుపేట, మండవల్లి మండలంలో మండవల్లి, పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, ముదినేపల్లి మండలంలో పెయ్యేరు, వడాలి గ్రామాల్లో చెత్తను రోడ్డు సమీపంలో పడేస్తున్నారు. ఏలూరు నుంచి కైకలూరు వచ్చే రహదారిలో వైఎస్సార్ గ్రీన్ విలేజ్ సమీపంలో చెత్త దర్శనమిస్తోంది. అనేక గ్రామాల్లో డంపింగ్ యార్డు స్థల సేకరణ జరగడం లేదు. మండవల్లిలో తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల సమీపంలో చెత్తను వేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయిన్లు అస్తవ్యస్తం

గ్రామాల్లో డ్రెయినేజీ విస్తరణ పనులు జరగలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. డ్రెయిన్ల ఆక్రమణల కారణంగా అవి కుచించుకుపోయాయి. కైకలూరులో పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో వ్యాపారులు డ్రెయిన్లను ఆక్రమించారు. డ్రెయిన్ నీటిని తరలించే వర్లకోడు, పుల్లవ డ్రెయిన్లు సైతం ఆక్రమించారు. డ్రెయిన్లపై అక్రమ కట్టడాలను పంచాయతీ అధికారులు అడ్డుకోకపోవడం వలన అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.

కొల్లేరు దోమల దాడి

నియోజకవర్గంలో కొల్లేరు సరస్సు వ్యాపించి ఉంది. దీంతో అక్కడ కిక్కిస పొదల్లో ఉండే దోమలు సమీప గ్రామాలపై దాడి చేస్తున్నాయి. దీనికి తోడు డ్రెయిన్లలో నీటి పారుదల లేకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పగలు సైతం దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విష జ్వరాలతో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



కైకలూరు నుంచి ఆటపాక వెళ్లే జాతీయ రహదారి పక్కనే చెత్తకుప్ప



మండవల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో చెత్త

ప్రజారోగ్యం పట్టదా ?



మండవల్లి మండల పరిషత్ కార్యాలయం సమీపంలోనే చెత్త దర్శనమిస్తోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చెత్తను అలాగే ఉంచుతున్నారు. వివిధ పనులకు వచ్చే ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశమైనా అధికారులకు పట్టదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– ఎల్ఎస్. భాస్కరరావు, సమాచార హక్కుల వేదిక నాయకుడు, మండవల్లి

పట్టించుకోవడం లేదు



మా కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయిన్లు సక్రమంగా ప్రవహించకపోవడంతో మురుగునీరు రోడ్లపైకే చేరుకుని దుర్వాసన వస్తోంది. దీని వలన దోమలు పెరిగిపోతూ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీనిపై నిరసనలు, ధర్నాలు చేసినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా స్పందించి డ్రెయిన్లు బాగు చేసి మమ్మలను కాపాడుతారని ఆశిస్తున్నాం.

– మొవ్వ ఫణీంద్ర, పెయ్యేరు వైఎస్సార్ కాలనీ, ముదినేపల్లి మండలం

ఎయిడ్స్‌ను తరిమి కొట్టాలి



ఇందిరానగర్ కాలనీలో ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు, అంకిత సభ్యులు

గుడివాడరూరల్: దేశంలో మహమ్మారిగా ఉన్న ఎయిడ్స్‌ను అందరూ తరిమికొట్టాలని అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ టి.అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అంకిత సంస్థ వారు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి చాలా ప్రమాదకరమైందన్నారు. ఈ వ్యాధి బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎయిడ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కషి చేస్తుందన్నారు. వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను సమాజంలో వివక్ష చూపకుండా చూడాలన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, సురక్షితం కాని సంబంధాలు, సిరంజిల వలన వ్యాపిస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ఉండి వ్యాధిని దూరం చేసేలా అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు, ప్రజలతో వార్డులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.లావణ్య, ఆశా, గన్‌వాడీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు ఘన నివాళులు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా హైదరాబాద్‌లో జరిగిన నిరసన ప్రదర్శనపై అప్పటి టీడీపీ ప్రభుత్వం కాల్పులు జరిపి అనేకమందిని తుపాకీ తూటాలతో గాయపర్చడంతో పాటు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిని బలితీసుకుందన్నారు. ఆనాటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రజలు పూర్తిగా వ్యతిరేకించారన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు విద్యుత్ ప్రైవేటీకరణపైనే ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. అందులో భాగంగానే అదానికి స్మార్ట్ మీటర్ల తయారీ అప్పగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల సొత్తును ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనుకోవడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.లక్ష్మణరావు, పి.రజిని, సీహెచ్ఎస్. నాగమల్లేశ్వరరావు, ఆర్. కొండ, బి.వెంకటేశ్వరరావు, వేశపోగు యెషయ్య పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన



అయ్యప్పస్వామి ఆలయ శంకుస్థాపన కార్యాక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయానికి బుధవారం పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేకా విజయబాబు, మురాల శ్రీనివాసరావు, జూపూడి మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే హాస్పిటల్లో చేస్తున్న రోగ నిర్ధారణా పరీక్షలు, ఓపీ వివరాలను డాక్టర్ వేద రాజ్, డాక్టర్ సీహెచ్ రాజేశ్వరీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మండవ శ్రీ కృష్ణ, మండవ రత్నగిరి, పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికలపై చెడుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు: బాలికలపై చెడుగా ప్రవర్తించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. తల్లిదండ్రులు మినహా ఎవరైనా సరే బాలికలను ముట్టుకునా, ఎత్తుకున్నా, ముద్దాడినా స్పర్శను జాగ్రత్తగా గమనించి, అమ్మానాన్నలకు చెప్పాలని పేర్కొన్నారు. స్థానిక జాగృతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం 'గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్' అంశంపై బాలబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి ఒక బొమ్మను తీసుకొచ్చి అవయవాల వారీగా ఎక్కడ ముట్టుకోకూడదు అనే అంశాన్ని చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. వారి ద్వారానే సమాధానాలు చెప్పించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో విద్యార్థి దశలో పిల్లలకు న్యాయ విజ్ఞాన సదస్సులు ద్వారా ఇటువంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ర్యాగింగ్‌నకు అందరూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీనల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, సీహెచ్. జయప్రకాష్, ఎంఎల్ఎస్‌సీ కో-ఆర్డినేటర్ భవానీ, హెడ్ కానిస్టేబుల్ సుధారాణి, పారాలీగల్ వలంటీరు వేణుబాబు, ఉపాధ్యాయులు నాగరాజు, సతీష్, ప్రసాద్, అల్లాఉద్దిన్, ఝాన్సీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గుడివాడ టౌన్: ది గుడివాడ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ దాసరి అలంకార్ తెలిపారు. సొసైటీ అధ్యక్షుడిగా కనిగంటి పీటర్‌పాల్, ఉపాధ్యక్షుడిగా కోరు రామస్వామి, కోశాధికారిగా కఠారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా చక్రాల భూపతిరాజు, జక్కుల విజయశేఖర్, సాలేటి వెంకటేశ్వరరావు, కనపర్తి సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

గుడివాడరూరల్: పట్టణంలోని ఓల్డ్ ఇండేన్ గ్యాస్ వీధిలో ఒక ఇంటిలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,630ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీఐ కొండపల్లి శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడరూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. పట్టణంలోని మేదర్ బజార్, కొత్త మున్సిపల్ ఆఫీస్‌రోడ్డు, రైలుపేట, నెహ్రూచౌక్, సత్యనారాయణపురం, ఎన్టీఆర్ స్టేడియం రోడ్డు, ఆర్‌కే హాస్పిటల్ రోడ్డు, బస్టాండ్ సెంటర్లలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

యాజమాన్య కమిటీ ఎన్నిక నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని కాకరవాడ శివారు దేవరం పాఠశాలకు యాజమాన్య కమిటీ ఎన్నిక నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఇటీవల పాఠశాల యాజమన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ పాఠశాలకు సంబంధించి చైర్మన్ ఎన్నిక తల్లిదండ్రులకు తెలియకుండా అనుకూలంగా ఉన్న వ్యక్తిని రహస్యంగా కమిటీ చైర్మన్‌గా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసుకున్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీనిపై బుధవారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

పామర్రు: గంజాయి విక్రయదారుడుని అరెస్ట్ చేసి, అతడి వద్ద ఉన్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పామర్రు సీఐ సుభాకర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ గతంలో స్థానిక జగపతి ప్లాట్స్ వద్ద పలువురు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారనే సమాచారంతో పామర్రు ఎస్ఐ అక్కడికి వెళ్లి ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారన్నారు. వారిని కస్టడీలోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి విచారణ చేపట్టి ఆ కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేశామన్నారు. మిగిలిన నిందితుడు బొమ్మారెడ్డి సందీప్‌రెడ్డిని బల్లిపర్రు నుంచి పెదమద్దాలి వెళ్లే మార్గంలో అరెస్ట్ చేసి అతడి వద్ద ఉన్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పామర్రు డెప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, వీఆర్వోలు మీనా, ప్రదీప్ సమక్షంలో గంజాయిని సీజ్ చేశామన్నారు. బుధవారం గుడివాడ కోర్టుకి పంపించినట్లు సీఐ తెలిపారు.

నీటి మడుగు ఒడ్డున ప్రభుత్వ కార్యాలయాలు



మండవల్లి: వర్షపు నీటి మడుగు ఒడ్డున ప్రభుత్వ కార్యాలయాలు కునారిల్లుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, తదితర కార్యాలయాలు అన్నీ ఒకే చోట ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం లోతట్టుగా ఉండటంతో వర్షం నీరు నిలిచింది. దీంతో అధికారులు, సిబ్బందితో పాటు కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులకు కూడా నీటి కారణంగా పారిశుద్ధ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. వెంటనే అధికారులు కార్యాలయాల చెంత ఉన్న వర్షం నీటిని బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పల్స్ సర్వే పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో పల్స్ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పల్స్ సర్వే ఇప్పటి వరకు 57 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను సత్వరమే పూర్తి చేస్తే తదుపరి చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వేలో ఎలాంటి లోటు పాట్లకు ఆస్కారం లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

జమీదగ్గుమిల్లి(పామర్రు): పామర్రు మండలం జమీదగ్గుమిల్లిలో శ్రీ గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్టను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది ఈ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత గణపతి పూజ, హోమం, పీఠన్యాసం, రత్నన్యాసం, ధాతున్యాసం నిర్వహించారు. అనంతరం మృగశిరా నక్షత్ర యుక్త కన్యాలగ్న పుష్కరాంశ మందు నూతన విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. తదుపరి కళావాహన, విశేష పూజ, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం ఘనంగా జరిపించారు. గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు దంపతులు వచ్చిన భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమ, జాకెట్టు, అరటిపండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ సన్నిధిలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, గంగానమ్మ తల్లి ఆలయ, సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జమీదగ్గుమిల్లి ఆలయంలో ప్రతిష్ఠించిన గంగానమ్మ తల్లి విగ్రహం



ముదినేపల్లి మండలం అలూరులో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జైజై ధ్వానాల నడుమ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ రెడ్డి సతీష్‌బాబు, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గులిపల్లి సుధారాణి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికైన ఎం.శ్రీనివాసరావును ఎస్టీయూ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ శ్రీనివాసరావుకు ఇంతటి గొప్ప అవార్డు రావడం 14 వేల మంది మున్సిపల్ ఉపాధ్యాయులకు గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు సులభమైన రీతిలో బోధించేందుకు వీలుగా సైన్స్ మెటీరియల్ అందజేయడం శ్రీనివాసరావు ప్రత్యేకత అన్నారు. సుమారు 25 సంవత్సరాలు భౌతికశాస్త్ర బోధనా రంగంలో ఆయన తనదైన ముద్రవేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం టీఎంఈ. రాణి, పీఎల్. నర్సమాంబ, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.